Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

గురువారం, 05 సెప్టెంబర్ 2024 విజయవాడ | సంపుటి: 01 - సంచిక : 87 | పేజీలు : 08 వెల రూ. 6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వరద బాధితుల సహాయం కోసం రూ.6 కోట్ల భారీ విరాళం ప్రకటించారు.

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

## బుడమేరు కబ్జాపై సర్వేతో..

# శాశ్వత పరిష్కారం

❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ❖నాల్గవ రోజూ వరద పీడిత ప్రాంతాల్లో పర్యటన

అమరావతి-సూర్య వాస్తవం



బుడమేరు కబ్జాలపై సర్వే చేయించి, శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికను రూపొం దిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వరుసగా నాలుగోరోజైన బుధవారం నాడు కూడా ఆయన పర్యటించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.. అందరికీ ఇంటింటికీ వచ్చి భోజనం అందిస్తారని, ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనతో చెప్పాలని వారిని కోరారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణానదికంటే బుడమేరు వల్లే విజయవాడకు తాజా వరదల్లో ఎక్కువ నష్టం కలిగిందని చెప్పారు. బుడమేరును పెద్ద ఎత్తున ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టినందువల్లే ఈ సమస్య ఏర్పడిం దన్నారు. అందువల్లే ఈ కబ్జాలపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికోసం నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. బుడమేరుకు 2019 తరువాత గండ్లు పడితే వాటిని పూడ్చాలనే కనీస చర్యలు తీసుకోలేదని, దీనివల్ల సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని అన్నారు. అప్పటినుండే ఒకరిద్దరు పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడిందని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు రాకుండా వార్డు సచివాలయాల వారీగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. రోడ్లు, ఇళ్లను శుభ్రంచేసేందుకు ఫైరింజన్లు తెప్పించామని అన్నారు. ప్రజలు సిద్ధమైతే వెంటనే పరిహారం పంపిణీ చేపడతామని అన్నారు. అలాగే ఎన్యుమరేషన్ కూడా చేయిస్తామని తెలిపారు. కొంతమంది నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం తరుపున బాధితుల కోసం కూరగాయలు అందు బాటులో పెడతామని తెలిపారు. ఎక్కడైనా మృతదేహాలు కనిపిస్తే సమాచారం ఇస్తే వాటిని గౌరవ ప్రదంగా తరలిస్తామని పేర్కొన్నారు సహాయ చర్యల కోసం రెండువేల మంది సిబ్బందిని నియమించామని, ప్రొక్లెయినర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తామని తెలిపారు. రోజుకో మూడుసార్లు ఐవిఆర్ఎస్ తెప్పించుకుని కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. నిత్యావసర వస్తువుల పంపిణీకి వెంటనే ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ముంపు నేపథ్యంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒకరోజు వేతనం ఇస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. అటువంటి వారిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు.

అందరి ఇళ్ల మాదిరే

- మిగతా 2లో..

## బ్రూనైలో రెండోరోజూ కొనసాగుతున్న

# మోడీ పర్యటన



బ్రూనై -సూర్య వాస్తవం

భారత ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా మంగళవారం బ్రూనై చేరుకున్నారు. ఆయనకు బ్రూనై సుల్తాన్ హాజీ హసనల్ బోల్కియా ఘన స్వాగతం పలికారు. ప్రపంచంలోని అత్యంత పొడవైన రాజభవనంగా పేరొందిన రాజు నివాసంలోకి ఆయనతోపాటు, ఆయన కుటుంబ సభ్యులు మోడీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ బోల్కియా రాజుకి, ఆయన కుటుంబ సభ్యులకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బ్రూనై 40వ స్వాతంత్ర్య వార్షికోత్సం సందర్భంగా ఆ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల గురించి చర్చలు జరపడం సంతోషంగా ఉందని మోడీ తెలియజేశారు. కాగా, రెండోరోజు పర్యటన బుధవారం రోజున ఆ దేశ రాజు బోల్కియాతో ప్రధాని నరేంద్రమోడీ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతున్నారని, వాటికి సంబంధించిన ఫొటోలను భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టు చేశారు. 'ఇరు దేశాధినేతల చర్చలు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వివిధ స్థాయిలలో ఆర్థిక, వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలు ప్రోత్సహించేందుకు చూపే చొరవ 'యాక్ట్ ఈస్ట్' విధానానికి దోహదపడనుందని, ఈ విధానంలో బ్రూనై కీలక భాగస్వామి కానుందని' ఈ సందర్భంగా రణధీర్ జైశ్వాల్ పోస్టులో పేర్కొన్నారు.

## 6న డయల్ యువర్ ఈవో

తిరుమల-సూర్య వాస్తవం



డయల్ యువర్ ఈవో కార్యక్రమం సెప్టెంబరు 6వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి 2.50 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో జె.శ్యామలరావుకి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## జమ్మూ కాశ్మీర్‌కు

# రాష్ట్ర హోదా..

- రాహుల్ గాంధీ హామీ



జమ్మూ-సూర్య వాస్తవం

జమ్మూ కాశ్మీర్‌లో బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా బ్లాక్ భాగస్వాములతో కలిసి కాంగ్రెస్ పార్టీ, కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూ కాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హౌదా కల్పిస్తుందని హామీ ఇచ్చారు. "అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ముందుగానే జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హౌదా పునరుద్ధరించాలని మేం భావించాం. కానీ బిజెపి అందుకు సుముఖంగా లేదు. ఎన్నికలను ముందుగానే నిర్వహించాలని భావించింది." అని రాహుల్ పేర్కొన్నారు. "బిజెపి కోరుకున్నా లేకపోయినా దానితో సంబంధం లేకుండా ఈ ప్రాంతానికి రాష్ట్ర హౌదాను పునరుద్ధరించాలను కుంటున్నాం. ఇండియా బ్లాక్ దీనిపై కేంద్రంతో పోరాడుతుందని రాహుల్ పేర్కొన్నారు. రాంబన్ జిల్లాలో బనిహాల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సంగ్లాదన్‌లో ఎన్నికల ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నెలల

- మిగతా 2లో..

## శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన

# లడ్డూ ప్రసాదాలు

■ నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు ■ టీటీడీ ఈవో జె.శ్యామలరావు

తిరుమల-సూర్య వాస్తవం



శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన లడ్డూ ప్రసాదాలు అందించేందుకు నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద బెంగుళూరుకు చెందిన కర్ణాటక కోపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ నుండి కొనుగోలు చేసిన నెయ్యి లారీ తిరుపతి నుండి తిరుమలకు బయలుదేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఈవో జె.శ్యామలరావు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ, లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, నాణ్యమైన నెయ్యి ద్వారా లడ్డూ నాణ్యత పెరుగుతుందని నిపుణులు తెలిపారన్నారు. గతంలో నెయ్యి సరఫరాదారులు నాణ్యత, రుచి, వాసన లేని ఆవు నెయ్యి సరఫరా చేశారన్నారు. టీటీడీలో నెయ్యి నాణ్యత పరిశీలించేందుకు సరైన ల్యాబరెటరీ లేదని, ప్రయివేటు ల్యాబరెటరీ సౌకర్యం ఉన్న పరిశీలించలేదన్నారు. టీటీడీలో నూతనంగా అత్యాధునిక ల్యాబరెటరీ ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. ఇందులోని సిబందికి మైసూర్ లో శిక్షణ ఇస్తున్నామన్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు ప్రముఖ డైరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్ డిఆర్‌ఏ విశ్రాంత ఆచార్యులు డా.సురేంద్రనాథ్, హైదరాబాద్ కు చెందిన డా.విజయ భాస్కర్ రెడ్డి, ప్రొ.స్వర్ణ లత, బెంగుళూరుకు చెందిన డా.మహదేవన్ ఉన్నారన్నారు. ఈ కమిటీ నాణ్యమైన నెయ్యి కోసం టెండర్ లో

- మిగతా 2లో..

## జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా

(మొదటి పేజీ తరువాయి)

18న ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు వికార్ రసూల్ వనీ ఈ నియోజకవర్గం నుండి పోటీచేస్తున్నారు.

## ఎరువుల దుకాణం ఆకస్మిక తనిఖీ



**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి:** మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని శ్రీకృష్ణ ఎరువులు మరియు పురుగుమందుల దుకాణంను మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వరరెడ్డి ఎందుకు బుధవారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీలో దుకాణ యజమాని సరియైన అనుమతులు చూపించనందున 6 లక్షల 72 వేల రూపాయలు విలువచేసే 24 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేయడం జరిగినది. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా తమ ఎరువుల లైసెన్సులో ఫారంను జత చేసుకోవాలి. అదేవిధంగా ధరల పట్టికలో ఎప్పటికప్పుడు ఎరువుల వివరాలు పొందుపరచాలి రైతులకు బిల్లులు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా రైతుల దగ్గర నుంచి బిల్లు పైన సంతకాలు తీసుకోవాలి. స్టాకు రిజిస్టర్లో ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరచాలి. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులను అమ్మాలని డీలర్లను హెచ్చరించడం జరిగినది. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు అమ్మితే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారము వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


## నంద్యాలలో ఘనంగా ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలు



**నంద్యాల-సూర్య వాస్తవం ప్రతినిధి:** నంద్యాలలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలు చాలా ఘనంగా జరిగాయని,ఊరు వాడ పల్లె అంతా ఏకమై గజ మాలలతో , కేకులతో , మేళ తాళాలతో ఒక పండుగ వాతావరణం లో ఎన్ఎండి ఫిరోజ్ గారి పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజల అభిమానాన్ని నేనెప్పటికీ మర్చిపోలేనని నాపైన ఎనలేని అభిమానంతో నాకు సోషల్ మీడియా ద్వారా ఫోన్ ద్వారా నేరుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అంతేకాకుండా నంద్యాలలో అన్నదాన కార్యక్రమాలు పుస్తకాలు పంపిణీ దుప్పట్లు పంపిణీ లాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందని మీ అందరి ఆప్యాయత అనురాగాలు నాపై ఇలాగే ఉంచాలన్నారు. అనంతరం అభిమానులు మాట్లాడుతూ ఫిరోజ్ నిండు నూరేళ్లతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశామని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ప్రజలు తెలియజేశారు.

## సురక్ష ప్రాంతాలకు గర్భిణులు

**అమరావతి-సూర్య వాస్తవం:** విజయవాడలో ఒక్కసారిగా ముంచెత్తిన వరదలతో నెలలు నిండిన గర్భిణులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోకి వరద చేరడంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఓ గర్భిణి వరద ప్రవాహంలోనే కష్టంగా నడుస్తున్న ఓ ఫొటో గుండెల్ని పిండేస్తోంది. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా ఇళ్లలో చిక్కుకున్న గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు, 10 రోజుల్లో డెలివరీ అయ్యే 154 మందిని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.



### శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన

# లడ్డూ ప్రసాదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి అంశాలు చేర్చాలని దిశ నిర్దేశం చేసిందన్నారు. కమిటీ సూచనలతో గతంలో నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారులలో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని మరియు కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయినట్లు చెప్పారు. ఈ కారణంగా నెయ్యి నాణ్యత మరియు రుచిని మెరుగుపరచడానికి టెండర్ షరతులను సవరించినట్లు తెలిపారు. కొత్త టెండర్ షరతు ప్రకారం, డెయిరీలు నెయ్యిలో ఉడకబెట్టడానికి ముందు కొన్ని గంటలపాటు ఎంపిక చేసిన స్టార్టర్ కల్చర్‌తో వెన్నని పక్వానికి తీసుకురావాలన్నారు. ఇంకా డెయిరీలు కావాల్సిన రుచిని పొందడానికి వెన్నను 120 డిగ్రీలు సెంటిగ్రేడ్ లో 2 -5 నిమిషాలు వేడి చేయాలని చెప్పారు. కర్నాటక కోపరేటివ్ మిల్క్ ప్రొడెక్ట్ (నందిని నెయ్యి) ని ఆమోదించి, నేరుగా కంపెనీ నుండి నెయ్యిని కొనుగోలు చేస్తున్నట్లు ఈవో వివరించారు. అదేవిధంగా, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. భక్తుల విజ్ఞప్తి మేరకు టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాలలో కూడా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా టీటీడీ స్థానికాలయాలైన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీ కోదండరామ స్వామివారి ఆలయం, శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయం, అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయం, దేవుని కడప, హైదరాబాద్ లోని హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్, అమరావతి, విజయవాడ, రాజమండ్రి, పిఠాపురం, విశాఖపట్నం, రంపచోడవరం, చెన్నైలోని శ్రీవారి ఆలయాలలో, బెంగుళూరు, వేలూరులలోని సమాచార కేంద్రాలలో సెప్టెంబర్ 2వ తేదీ 50 వేలు, సెప్టెంబర్ 3వ తేదీ 13 వేలు సెప్టెంబర్ 4వ తేదీ 9,500 లడ్డూలు విక్రయించినట్లు ఈవో తెలిపారు. భక్తులు టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాలలో కూడా శ్రీవారి లడ్డూ ప్రసాదాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ గౌతమి, సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో పద్మావతి, నందిని డైరీ లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# బుడమేరు కబ్జాపై సర్వేతో శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

అందరి ఇళ్లలోకి నీరు వచ్చింది. అలాగే మా ఇంట్లోకి వస్తాయి. దానివల్ల ఇబ్బందేమిటి' అని చంద్రబాబు ప్రశ్నించారు. వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నా ఓర్వలేకపోతున్నారని తెలిపారు. అమరావతి మునిగిపోయింది, అదో శ్మశానమని అంటున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన వారు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఒకపక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సహకరించాల్సిందిపోయి రాజకీయ విమర్శలు చేస్తూ అరాచకం చేయాలని చూస్తున్నారన్నారు.

**మానవతా కోణంలో ఆలోచించండి**

ముంపులో మునిగిపోయి నష్టపోయిన వాహనాల ఇన్సూరెన్స్ చెల్లింపులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మానవతాకోణంలో ఆలోచించి వాహనాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయించాలని కోరారు. ఇన్సూరెన్స్ చేసుకున్న ప్రతి వస్తువుకూ చెల్లింపులు ఉండేలా చూడాలని కోరారు. ముంపులో మునిగి ఒకవేళ వాహనాల పత్రాలు పాడైపోతే కంపెనీలే వాటిని తీసి ఇచ్చి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు.

**ఆక్రమణలను తొలగించాలంటే అనేక అడ్డంకులు**
**- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్**

అక్రమ నిర్మాణాలను తొలగించాలంటే సామాజిక పరిస్థితులు, న్యాయపరమైన అడ్డంకులు అనేకం ఉంటాయని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరును ఆక్రమించి దాని సహజ స్వరూపాన్ని పూర్తిగా నాశనం చేసిన నిర్మాణాల వల్లే విజయవాడకు వరద విపత్తు వచ్చిందన్నారు. నదీ పరివాహక ప్రాంతాలు, డ్రైయిన్లు, వాగులు, వంకలు, చెరువుల్ని ఆక్రమించి ఇష్టానుసారం లేఅవుట్లు వేశారని తెలిపారు. గత కొంతకాలంగా ఈ ఆక్రమణలు సాగుతూనే ఉన్నాయని, గత ప్రభుత్వంలో కనీసం దీనిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. అక్రమ నిర్మాణాన్ని ధ్వంసం చేసే కంటే నిర్మించక ముందే అడ్డుకోవడం ఉత్తమ మార్గమని చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా చేస్తున్న పని సరైనదేనని అభినందించారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు నివాస కాలనీలు కట్టబెట్టిందని విమర్శించారు. వైసిపి నాయకులు అనవసరపు మాటలు మానుకొని జేబులో డబ్బును విరివిగా విరాళంగా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సినిమా వాళ్ల దగ్గరకంటే మాజీముఖ్యమంత్రి జగన్ దగ్గరే ఎక్కువ సంపద ఉంటుందని విమర్శించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోండి

### జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ

**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి :** వినాయక నిమజ్జన మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులను సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని సెంటనరీ హాలులో వినాయక నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, నంద్యాల డిఎస్పి యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్, కేంద్ర గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు జి రామకృష్ణారెడ్డి, జి విజయ్ కుమార్, సివి చలం బాబు, నిమ్మకాయల సుధాకర్, నాగేంద్ర, శంకర్, పుల్లయ్య, సత్యం, కృష్ణమాచారి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో వినాయక నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనులు జరుగుతున్నా యన్నారు. కమిటీ సభ్యులు సూచించిన అంశాలను కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ మేర ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ మండపాల విద్యుత్ కనెక్షన్లకు 1100 రూపాయలు చెల్లిస్తామని, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, భారికేడ్ల ఏర్పాటు, గజ ఈతగాళ్లు, బోట్లు లైటింగ్ తదితర అంశాలన్నింటిని మొదటి కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులకు జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తుతో నిమజ్జన ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించామని ఉత్సవ కమిటీ సభ్యులందరూ అధికారులకు, పోలీసులకు సహకరించాలని కోరారు. నంద్యాల పట్టణంలో 11వ తేదీ ముమ్మర పారిశుద్ధ్య చర్యలతో పాటు గుర్తించిన నాలుగు ప్రదేశాల్లో త్రాగునీటి సదుపాయం, చెరువు కట్టపై రెండు మొబైల్ టాయిలెట్లు, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు ను తడిచిన కర్రలతో సవరించడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని సంబంధిత విగ్రహ కమిటీ సభ్యులు ముందస్తుగా విద్యుత్ అధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ మారిన కాలమాన పరిస్థితులను బట్టి ప్రభుత్వ ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జనం మహోత్సవాలను ప్రశాంతంగా జరిగించేందుకు కమిటీ సభ్యులందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. చెరువు కట్ట, గాంధీచౌకు, విక్టోరియా రీడింగ్ రూమ్లలో మూడు మెడికల్ క్యాంపు లతో పాటు వద్ద 108 అంబులెన్స్ ను కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్లోని గణేష్ విగ్రహాన్ని తొలుత నిమజ్జనం చేసి పిదప నిరంతరాయంగా పట్టణంలోని దాదాపు 500 విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకుముందు జిల్లావ్యాప్తంగా హాజరైన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## అపరాజిత సరే..శిక్షలు ఎక్కడ

దేశంలో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాల కేసుల్లో 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయంటే మన నేర ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏ విధంగా ఉందో ఈ గణాంకాలే తె లియజేస్తున్నాయి. అత్యాచారాలు చేసిన 72 శాతం నిందితులు నేర వ్యవస్థలో డొల్లతనాన్ని అసరాగా చేసుకొని నిర్ధోషులుగా బయటపడు తున్నారు. కోల్‌కతా రేప్ కేసును చేపట్టడంలో మొదటి నుంచి జరిగిన తప్పులు ఆ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. కోల్‌కతా నగరం రోడ్లన్నీ విద్యార్థుల ఆందోళనలతో, పోలీస్‌ల ప్రతిఘటన చర్యలతో రణరంగంగా దద్దరిల్లింది. దీనికి కారణం దర్యాప్తులో జరిగిన తప్పు లు, వ్యవస్థలోని లోపాలు చివరకు మమతాబెనర్జీ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు దారి తీస్తున్నాయి.అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా రూపొందించిన బిల్లును పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. అపరాజిత మహిళ, శిశు(పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా.. ముందుగా హామీ ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. కేంద్ర చట్టాలు-- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎ?స), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎ?సఎ?స), చిన్నారులపై అత్యాచారాల నిరోధక చట్టం(పోక్సో)లో తగు సవరణలు చేయాల్సిందిగా ఈ బిల్లు సూచిస్తోంది. ముఖ్యంగా.. హత్యాచారాలు, అత్యాచారాలతో బాధితురాలి మానసిక స్థితి దెబ్బతినేలా చేసే నిందితులకు మరణ శిక్ష విధించాలని అపరాజిత బిల్లు స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కాగా, సభలో బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. “మా ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు తరహాలో.. ప్రధాని మోదీ చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గుపడాల్సిన అంశం. ఈ బిల్లును హుందాగా ఆమోదించాల్సిందిగా గవర్నర్‌ను కోరుతున్నాను. సభలో విపక్ష నేత(బీజేపీ) కూడా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా, వీలైనంత త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను” అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఘటనలో సీబీఐ న్యాయం చేయాలని ఆమె కోరారు. ఏటా 30,000 కు పైగా అత్యాచారాలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమే కాకుండా, నేర న్యాయవ్యవస్థలోని పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లుఈ నాలుగు విభాగాల పనితీరులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ప్రకారం అత్యాచారాల కు పడిన శిక్షలు 2018 నుంచి 2022 వరకు 27 శాతం నుంచి 28 శాతం వరకే ఉన్నాయి. అంటే దేశంలో 72 శాతం అత్యాచార కేసు లు ఎలాంటి శిక్ష లేకుండానే ముగిసిపోయాయని చెప్పవచ్చు. అలాగే 2022లో బాలికలపై లైంగిక దాడి కేసులు 63 వేలకు పైగా నమోదయ్యాయి. అంటే దేశంలో ప్రతి పది నిమిషాలకు ఒక బాలికపై అత్యాచారం జరిగిందని తెలుసుకోవచ్చు. ఇన్ని జరుగుతున్నా నేరవ్యవస్థలోని నాలుగు విభాగాలు పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లు తమ విధుల్లో సామూహిక వైఫల్యం చెందితే నేరస్థుల హృదయాల్లో శిక్ష అంటే ఏమాత్రం భయం ఉండదు. నేరాలను దర్యాప్తు చేసేది మొ దట పోలీసులే.తమ దర్యాప్తులో ఎలాంటి దౌర్బల్యాలకు చోటీయరాదు. దీనికోసం మొదట క్రైమ్‌సీన్‌ను పరిరక్షించుకోవాలి. దీనివల్ల నిపుణులు సాక్షాలను సరైన విధానంలో సేకరించ గలుగుతారు. దర్యాప్తు ప్రారంభదశలో నేరం నమోదు ఆలస్యమైతే తప్పు చే సినట్టే. కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో ఎఫ్ఐఆర్ నమోదు 14 గంటలు ఆలస్యమైంది. అంతేకాకుండా క్రైమ్‌సీన్‌ను రక్షించకుండా ధ్వంసం చేశారు. దీంతో అనేక అనుమానాలు పెరిగి దర్యాప్తునే శంకించ వలసిన పరిస్థితి ఏర్పడింది. బద్లాపూర్ కేసులో కూడా ప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్న తరువాత పోలీస్‌లు దర్యాప్తుకు రంగంలో దిగారు. ఎఫ్ఐఆర్ నమోదులో వాంగ్మూలాలు రికార్డు చేయడంలో విపరీతమైన జాప్యం చేయడంపై బొంబాయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత క్రైమ్‌సీన్ నుంచి బలమైన సాక్షాలను సేకరించడం, పరిశోధకుల పాత్ర, అత్యంత ప్రాధాన్యమైనవి. పోలీస్‌లు దర్యాప్తు పకడ్బందీగా నిర్వహించి సకాలంలో సంపూర్ణ న్యాయం అందేలా చూడవలసిన బాధ్య త రాష్ట్రాలదే. కానీ ఘరానా కేసులు ప్రజాందోళనల తరువాత ఎందు కు సిబిఐకి బదిలీ అవుతుంటాయి? అని ప్రశ్నించుకుంటే ఆయా రాష్ట్రాల దర్యాప్తు తీరుపై నమ్మకం లోపించడమే.దర్యాప్తు సరిగ్గా లే కుంటే ప్రాసిక్యూషన్‌కు కోర్టు విచారణల్లో అప్పీళ్లలో లీగల్ ప్రొసీడింగ్‌లో ప్రతిదశలో సమస్యలు ఎదురవుతాయి. చివరకు అత్యాచార నేరస్థులు చట్టం నుంచి తప్పించుకుని దర్జాగా బయటకు వెళ్లిపోతారు.

ప్రాసిక్యూషన్ నేరస్థులకు శిక్షపడేలా చేసినా, శిక్ష అమలులో విపరీతమైన జాప్యం చేస్తే బాధితులకు సకాలంలో న్యాయం అందించలేని వారవుతారు. 2012 ఢిల్లీ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు గ్యాంగ్ రేప్ నేరస్థులకు ఏడాదిలోగా విచారించి ఉరిశిక్ష విధించింది. కానీ నేరస్థులకు ఏడేళ్లకు కానీ ఉరిశిక్షఅమలు కాలేదు. దేశంలో నేరన్యా య వ్యవస్థ పునస్సమీక్షించిన తరువాత క్రూరమైన కేసుల్లో ఏడేళ్లు అంతకు మించి శిక్షపడనున్న కేసుల్లో ఫోరెన్సిక్ పరీక్షలు తప్పనిసరి చేశారు. 12 ఏళ్ల కన్నా తక్కువ వయసు బాలికలపై అత్యాచారానికి పాల్పడితే జీవితకాల శిక్షలేదా మరణశిక్ష పడుతుంది. ఈ కేసుల్లో ఫోరెన్సిక్ బృందం పరీక్షలను విస్తృతం చేశారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత 2024 ఫోరెన్సిక్ పరీక్షలో వీడియోటేప్ రికార్డింగ్ తప్పనిసరిగా చేయాలన్న నిబంధన విధించారు.ఫిర్యాదుల పరిశీలనకు, ఛార్జిషీట్ల దాఖలుకు గడువు నిర్ణయించారు. మహిళలపై కేసు ల విషయం లో ఎలెక్ట్రానిక్ ఎఫ్ఐఆర్ సిస్టమ్ ప్రవేశ పెట్టారు. దర్యా ప్తు సంస్థలు తమ విధిని సక్రమంగా సకాలంలో నెరవేర్చగలిగితేనే ఈ న్యాయ సంస్కరణలు సత్ఫలితాలు అందిస్తాయి. కానీ ప్రాథమిక దర్యాప్తులో వైఫల్యం , ఫోరెన్సిక్ సాక్షాల సేకరణలో అసంపూర్తి లేదా ఆలస్యం , ఇవన్నీ చివరకు బాధితులకు న్యాయం లభించడం కష్టతరం చేస్తున్నాయి. కాబట్టి దర్యాప్తు సంస్థ క్రైమ్‌సీన్‌ను పరిరక్షించడం, సాక్షాలను సమగ్రంగా సేకరించడం అత్యంత అవసరం. అప్పుడే కేసు బలంగా ఉండి నిందితులకు శిక్షపడుతుంది. ఈ చర్యలన్నీ మహిళలపై జరిగే నేరాలను పూర్తిగా నివారించలేక పోయి నా, నేరగాళ్ల మనసులో భయం కలిగిస్తాయనడం వాస్తవం. అలాగే బాధితులు, వారి కుటుంబీకులు న్యాయం కోసం సుదీర్ఘకాలం నిరీక్షించవలసిన అగత్యం ఉండదు.

### ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహా మనిషి

# సర్వేపల్లి రాధాకృష్ణన్

## -నేడు ఆయన జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం)

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్, వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన.. సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి మరియు తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.



వీళ్లది చాలా పేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.


మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మే పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్సలర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన ‘ఇండియన్ ఫిలాసఫీ’ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. ‘యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్’లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్. 1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట.రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

# ధర్మాన రాజకీయ సన్యాసమేనా

**శ్రీకాకుళం-సూర్య వాస్తవం**

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వైసీపీకి దూరమేనా? ఆయన పార్టీలో కొనసాగరా? రాజకీయాల నుంచి నిష్క్రమించాలని భావిస్తున్నారా? లేకుంటే మరో పార్టీలో చేరాలనుకుంటున్నారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. పార్టీ ఓటమి నుంచి ఆయన బయటకు కనిపించడం లేదు. ఇంటి నుంచి బయటకు రావడం లేదు. కనీసం ఓటమి పై సమీక్షించలేదు. ఒక్క ప్రకటన చేయడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. నిన్నటికి నిన్న శ్రీకాకుళంలో జరిగిన వైయస్సార్ వర్ధంతి కార్యక్రమానికి కూడా హాజరు కాలేదు. స్థానికంగా ఉన్నా అటువైపుగా చూడడం లేదు. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెబుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు కుమారుడి కోసం టిడిపిలో చేరతారని కూడా టాక్ నడుస్తోంది. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి వెళ్లాల్సి వచ్చిందని.. కానీ అక్కడ ఏమంత కంఫర్ట్ గా లేరన్నది గత కొద్దిరోజులుగా వినిపిస్తున్న మాట. అందుకే ఇప్పుడు పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారని.. పార్టీ నుంచి బయటకు వస్తారని ప్రారంభమైంది.ధర్మాన ప్రసాదరావు వైయస్ రాజశేఖర్ రెడ్డికి సమకాలీకుడు. 2003లో పాదయాత్ర చేసిన సమయంలో ధర్మాన ప్రసాదరావు రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడిగా మారారు. ఆ ఎన్నికల్లో నరసన్నపేట ను వదిలి శ్రీకాకుళం నుంచి పోటీ చేసి గెలిచారు ప్రసాదరావు. ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖను అప్పగించారు రాజశేఖర్ రెడ్డి. ఆయన బతుకు ఉన్నంతవరకు ఒక వెలుగు వెలిగారు. కానీ జగన్ పుణ్యమా అని ధర్మాన ప్రసాదరావు చరిత్ర మసకబారుతూ వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన జగన్ వెంట నడవాల్సి వచ్చింది.కాంగ్రెస్ పార్టీని విభేదించారు జగన్. సొంతంగా వైసీపీని ఏర్పాటు చేశారు. దానిని తీవ్రంగా తప్పు పట్టారు ధర్మాన ప్రసాదరావు. అప్పటికే ఆయన మంత్రిగా ఉన్నారు. జగన్ ను టార్గెట్ కూడా చేసుకున్నారు. అయితే రాష్ట్ర విభజన పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీ ఏపీలో దారుణంగా నష్టపోయింది. అదే సమయంలో వైసీపీ ఆవిర్భవించింది. అప్పటివరకు జగన్ ను తిట్టిన ధర్మాన అదే పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. అది రాజకీయంగా కూడా మైనస్ గా మారింది. 2014 ఎన్నికల్లో ధర్మాన ప్రసాదరావు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసినా ఓటమి తప్పలేదు. పోనీ జగన్ విడిచిపెడతామని భావించినా ప్రత్యామ్నాయం లేదు. దీంతో 2019 ఎన్నికల్లో గెలిస్తే మంత్రి పదవి ఇస్తారని భావించి వైసీపీలో కొనసాగారు ధర్మాన ప్రసాదరావు.2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో గెలిచారు ధర్మాన ప్రసాదరావు. కానీ ఆయనకు కాకుండా సోదరుడు ధర్మాన కృష్ణ దాస్ ను క్యాబినెట్ లోకి తీసుకున్నారు జగన్. ఈ నిర్ణయం ధర్మానకు మనస్థాపానికి గురిచేసింది. ఏ మంత్రి పదవి కోసం ఎన్ని రోజులు జగన్ వెంట ఉన్నానో.. అదే పదవి దక్కకపోయేసరికి ధర్మానలో ఒక రకమైన అసంతృప్తి కనిపించింది. దీంతో పరిస్థితి చేయి దాటుతుందని భావించిన జగన్ విస్తరణలో ధర్మానకు ఛాన్స్ ఇచ్చారు. కానీ మునుపటిలా స్వేచ్ఛ లేదు. దీంతో అసంతృప్తితోనే మంత్రి పదవిని అనుభవించారు. ఈ ఎన్నికల్లో ఒక సాధారణ సర్పంచ్ చేతిలో ఓడిపోయారు. ఇష్టం లేని వైసీపీలో ఉండలేక.. ప్రత్యామ్నాయం లేక రాజకీయ సన్యాసం దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం టిడిపిలో చేరతారన్న ప్రచారం అయితే ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.






# ఎస్సార్ఐటీ అటానమస్ ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు–సూర్యవాస్తవం: మండల పరిధిలోని సాయి రాజేశ్వరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ వారికి 2024 జూన్ లో నిర్వహించిన అటానమస్ పరీక్షా ఫలితాలలో సివిల్ బ్రాంచ్ కి చెందిన వెంకట కల్యాణ్ కుమార్ రెడ్డి 7.74 శ్రావణి 7.64, అర్జున్ 7.49, ఈ.సి.ఈ నందు దివాకర్ 9.54, శిరీష, ఫర్హానా 9.38, దీపిక 9.23, సి.యస్.ఈ విభాగం నందు కీర్తి 9.13, వెంకట సమలత 8.98., శారద మరియు సుమనందిని 8.83, అలాగే సి.ఎస్.ఈ (ఎఐ అండ్ ఎంఎల్) నందు లహరి 9.13, నాగేశ్వరి 8.36., మహమ్మద్ ఫరూక్ 8.15 శాతం మార్కులు సాధించి కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారని ప్రిన్సిపాల్ పాండురుగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడి లు, అధ్యాపకులు అభినందించారు.

# కలెక్టర్ శ్రీధర్‌ను కలిసిన పంతగాని నరసింహ ప్రసాద్



రైల్వేకోడూరు – సూర్యవాస్తవం: అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామ కూరిని బుధవారం రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొట్టమొదటిసారిగా తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్ ను కలిసి పలు నియోజకవర్గంలో సమస్యలును, అలాగే ముఖ్యంగా దళితుల సమస్యలపై చర్చించినట్లు పంతగాని నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. ఈయన వెంట రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ కి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలి

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్**




లక్కిరెడ్డిపల్లె – సూర్యవాస్తవం: గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థినులకు తెలియజేస్తూ ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు.లక్కిరెడ్డిపల్లి బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో 5 వ తరగతి విద్యార్థిని పై జరిగిన అత్యాచారం ఘటన అంశంపై బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ కం మండల న్యాయ సేవ సమితి జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిసాలు సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు పిల్లలతో మాట్లాడి పిల్లలకు, ఉపాధ్యాయులకు ధైర్యం చెప్పారు.గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థినులకు తెలియజేస్తూ ఉండాలన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని,తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబర్లు అయిన 100, 1098, 15100 లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి అన్నారు.ఏవైనా సమస్యలు ఉంటే లక్కిరెడ్డిపల్లె మండల న్యాయ సేవా సమితినీ సంప్రదించవచ్చును అన్నారు.ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్రబాబు,రెవెన్యూ అధికారులు,ఇన్చార్జి ప్రిన్సిపల్, ఉపాధ్యాయునిలు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# బదిలీలలో పైరవీలు

రైల్వే కోడూరు– సూర్యవాస్తవం: రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఇటీవల బదిలీల ప్రక్రి య వేగవంతం కాగా ఇందులో కొంతమంది పైరవీలు నిర్వహిస్తున్నారని నియోజకవర్గంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది రాజకీయ నేతలు చోట లీడర్లు అయినా వారికి అందలం ఎక్కే విధంగా పైరవీలు కొనసాగిస్తూ ఉద్యోగస్తుల వద్ద నగదు తీసుకొని మీ స్థానం పదిలమని చెబుతూ కొంతవరకు నగదును సొమ్ము చేసుకుంటు న్నారని ఉద్యోగ సంఘాలు కూడా ఆరోపిస్తు న్నాయి. రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఎంతో కాలంగా ఇక్కడే ఉన్నా ఉద్యోగస్తులు ఎట్టకేలకు మార్పు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బదిలీల ప్రక్రియ ఈనెల 15 కు వాయిదా పడడంతో మరి కొంతమంది ఆపుకోవాలని ఉద్దేశంతో కూడా ప్రయత్నాలు జోరందుకున్నాయి. కొంతమంది రిటైర్మెంట్ స్టేజ్ లో ఉన్న ఉన్నారు వారు కూడా మమ్ములను బదిలీ చేయకండి మహాప్రభు అని కొంతమంది వద్ద విలపించిన బదిలీ తప్పదని అంటున్నారు. పరిపాలన సక్రమంగా జరగాలంటే కొత్తవారితో పనిచేయించాలనే ఉద్దేశం కొత్తగా చేపట్టిన ప్రభుత్వం నూతన పాలనకు శ్రీకారం చుడుతున్నారు.

కాగా రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాక నిర్వి రామంగా ఇన్చార్జిల పాలనే కొనసాగుతున్నదని రైల్వే కోడూరు నియోజకవర్గానికి రావాలంటే అధికారులు వకింత బిడియం కొనసాగుతుంది. ఇక్కడ ఉన్న పాలకులు మూడు వర్గాలుగా ఉండడంతో వెళ్లిన మరో వర్గానికి చేటు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు బెంబేలు ఇస్తున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవచూపి ఇన్చార్జి పాలనకు స్వస్తి పలకాలని ప్రజలు కోరుకుంటున్నారు. అయితే ఈ నెల 15న జరగబోయే ప్రక్షాళనలో ఎవరు ఉంటారు ఎవరు వెళతారో తెలియని పరిస్థితుల్లో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.



# ముగిసిన కుక్కల దొడ్డి ఉరుసు



రైల్వేకోడూరు– సూర్యవాస్తవం: రైల్వే కోడూరు మండల పరిధిలో జిల్లా సరిహద్దులో ఉన్న కుక్కల దొడ్డిలో జరిగిన ఉరుసు బుధవారంతో ఘనంగా ముగిసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ జహంగీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కుక్కల దొడ్డి ఉరుసును దాతల సహకారంతో ఉరుసు ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు షేక్ అక్బర్ బాషా, కమిటీ మెంబర్స్ ఆధ్వ ర్యంలో బుధవారం ఉరుసును ఘనంగా నిర్వహించి ,వందలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని జహంగీర్ తెలిపారు. ముఖ్యంగా ఈ ఉత్సవానికి రైల్వే కోడూరు, వెంకటగిరి, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి , రాజంపేట, నందలూరు తదితర ప్రాంతాల నుండి భారీగా భక్తులు పాల్గొన్నారు.

# జాతీయ లోకాదలత్ పై ప్రజలకు అవగాహన కల్పించండి





లక్కిరెడ్డిపల్లె – సూర్యవాస్తవం: సివిల్, క్రిమినల్ కేసులపై జాతీయ లోకాదళత్ లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దిన్, లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ పై జున్నిసా లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో లక్కిరెడ్డిపల్లి,రామాపురం, గాలివీడు పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోకాదలత్ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో క్రిమినల్ , సివిల్ ,ఇతర కేసులు పరిష్కరించుకోవచ్చని వారు తెలియజేశారు.బ్యాంకు నుండి తీసుకున్న రుణాలు, మొండి బకాయిల గురించి లోకాదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్సైలు,రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణే మాదిగల చిరకాల ఆకాంక్ష

**- ఎస్సీ వర్గీకరణతో 59 కులాలుకు న్యాయం**

**మాదిగలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలి**



పత్తికొండ టౌన్– సూర్యవాస్తవం: సెప్టెంబర్ 04 ఎస్సీ వర్గీకరణ మాదిగల జన్మహక్కు అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నా రు. బుధవారం పత్తికొండలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగలతో పాటు 59 ఉప కులాలకు మేలు జరుగుతుందన్నారు.మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల అలుపెరగని సుదీర్ఘ పోరాటం చేసిన ఫలితంగానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు.ఆర్టికల్ 341జీవోను సవరించి దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిందని అన్నారు, ఇప్పుడైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు ముత్యాల తిరుపాల్, నాయకులు సుధాకర్, బైరపోగు శాంత కుమారి పక్కిరప్ప ఎల్లప్ప గుండుబాషా నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మూడుసార్లు గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజా

**- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు**



వీరబల్లి– సూర్యవాస్తవం: మండలంలోని వంగిమల పంచాయతీకి చెంది కొర్ల కుంట నాగరాజా తల్లిదండ్రులు రమణ రత్నమ్మలకు కలిగిన కుమారుడు నాగ రాజా అనే వ్యక్తి చిన్నప్పుడు నుండి ఆట పోటీలు అంటే ఎంతో ఇష్టమని పాల్గొని ఈ పోటీలలో గెలుపొందడమే అతని పట్టుదల అని పదవ తరగతి నుండి డిగ్రీ వరకు కాలేజీ ల కు వెళ్లి చదువుతోపాటు ఆట పోటీల్లో కూడా పాల్గొన్నారు ముఖ్యంగా వెయిట్ అప్పర్ ఆట పోటీలలో లో పాల్గొని అనంతరం నేపాల్ కు చెందిన వారు కూడా ఇతని గుర్తించి నేపాల్ దేశంలో వెయిట్ అప్పర్ లో మూడవసారి 350 కేజీల బరువును ఎత్తడం జరిగిందన్నారు గెలుపొంది మూడవ సారీ గోల్డ్ మెడల్ నేపాల్ దేశంలో సాధించినందుకు ఆదేశ వాసులు కూడా అతన్ని స్పోర్ట్స్ పరంగా ఎంతో గౌరవించారన్నారు దీంతో తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు ఈ సందర్భంగా నాగరాజా తల్లిదండ్రులు మాట్లాడుతూ మా కుమారుడు మూడవసారి గోల్డ్ మెడల్ సాధించినందుకు మాకు ఎంతో సంతోషంతో పాటు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు ఇంకా ఆట పోటీలలో గెలుపొంది మంచి స్థాయికి వెళ్ళాలని అదేవిధంగా మాది కూడా నిరుపేద కుటుంబం నుంచి రావడం జరిగిందన్నారు.

# పర్యావరణ సహితంగా గుండ్లముల ఇసుక రీచ్ నిర్వహణ

**- రైతుల భూములకు ఎలాంటి ఇబ్బందులూ వుండవని హామి**

**- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి**




సిద్దవటం –సూర్యవాస్తవం: పర్యావరణ సహితంగా గుండ్లమూల ఇసుకరీచ్ ప్రభుత్వమే నిర్వహి స్తుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం సిద్ధవటం మండలం గుండ్లముల గ్రామంలో నూతనంగా అనుమతి పొందిన ఇసుక రీచ్‌పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతోటి మాట్లాడుతూ సిద్ధవటం మండలంలోని గుండ్లమూల గ్రామంలో సర్వేనెంబర్ 374 నందు పెన్నానదిలో పది హెక్టార్లలో సంవత్సరానికి 1,00,000 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకం పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరకే ఇసుకను అందుబాటులోకి తేవడానికి గుండ్లముల ఇసుక రీచ్ ను గుర్తించడం జరిగిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నియమ నిబంధనల ప్రకారం పర్యావరణానికి ఎటువంటి నీటి వాయు, శబ్ద కాలుష్యం జరగకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతకుముందే ఎస్ వి ఎన్విరో ల్యాబ్స్ ద్వారా సాంకేతికంగా ఇక్కడ ఇసుక తవ్వకాలు లభ్యతపై సర్వే చేయించడం జరిగిందన్నారు. అలాగే గుండ్లమల, మూలపల్లి గ్రామపంచాయతీలకు ఇక్కడి ఇసుక తవ్వకాల్లో నుంచి వచ్చిన వాటాతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామంలోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగవని ట్రాన్స్పోర్ట్ కూడా గ్రామంలో నుంచి కాకుండా బద్వేలు సిద్ధపటం నార్త్ వైపు నుంచి ఇసుకను తరలిస్తామని తెలిపారు. ఈ గ్రామ ప్రజలకే ఇసుక రీచ్ లో పనిచేయడానికి ఉపాధి కల్పిస్తామన్నారు. అలాగే ఇసుక రీచులు వద్ద సీసీ కెమెరాలు, జీపిఎస్ ట్రాన్స్పోర్ట్ విధానాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జీవి వైవిధ్య ప్రమాణాలు, వాయు నాణ్యతకు లోబడే ఇసుక తవ్వకాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ అధికారి శ్రీనివాసులు, గనులు భూగర్భ శాఖ ఆర్.ఐ. విమలమ్మ,, కడప ఆర్డీఓ వెంకటపతి, తహసీల్దార్ మురాషావల్లి, ఎస్.వి ఎన్విరో కన్సల్టెంట్ సునీల్ కుమార్, గనుల శాఖ సిబ్బంది, రెవెన్యూసిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు

## శ్రీశైలం పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకున్న మాజీ ఎమ్మెల్యే



పామిడి -సూర్యవాస్తవం : గుంతకల్లులో ఉన్నటువంటి జగద్గురు మఠంకు శ్రీశైలం పుణ్య క్షేత్రం జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య స్వామి విచ్చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ శాసన సభ్యులు. ఆర్.జితేంద్ర గౌడ్ ముందుగా జగద్గురు మఠంలోని ఆ పరమేశ్వరు డిని దర్శంచుకున్న అనంతరం చెన్న సిద్దరామ పండితారాధ్య స్వామి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఈ పూజ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కేశప్ప, శివయ్య, రంగా, పాత గుంతకల్లు టీడీపీ శ్రేణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు..

## మట్టి వినాయకుడి ప్రతిమలు.... పర్యావరణానికి మేలు.....

**- సీఐ శాంతి లాల్**




అనంతపురం క్రైం- సూర్య వాస్తవం: ప్రకృతిని కాపాడాలనే భావంతో ఆళ్లగడ్డ రాము ప్రతి ఏటా మట్టి ప్రతిమ లను పూజించడాన్ని ప్రోత్సహిస్తూవస్తు న్నారు. అందులో భాగంగా బుధవారం నాడు మట్టి వినాయకుడి ప్రతిమలను భక్తులకు, వైశ్య హాస్టల్ విద్యార్థులకు మట్టి వినాయకుడి ప్రతిమలను మూడవ పట్టణ సీఐ శాంతి లాల్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఏ శాంతి లాల్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులు రసాయనాలు వాడి ప్రకృతిని కలుషిత చేయొద్దని ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే ప్రకృతికి నష్టం చేయని మట్టి ప్రతిమలు వాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో.... హను మంతకారి సాయినాథ్, ఆర్వేటి అనిల్, బెల్లంకొండ వెంకటేశ్వర ప్రసాద్, హనుమంతకారి శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్, వెంకట కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్, విజయ కుమార్, ఆర్ఎస్ఎస్, మల్కారి దిలీప్ కుమార్, మల్కారి భరత్, సివిల్ ఇంజనీర్ మల్కారి కృష్ణజీరావు, మల్కారి స్వామి రావు, ఉల్లిగడ్డల ప్రకాష్, వరగాని శ్రీనివాసరావు, మల్లాపురం దిలీప్ కుమార్, చాపల శివ, బుర్ర ముఖేష్ గౌడ్, గండికోట సురేష్ కుమార్, మేకల నాగరాజు, వెంకటేశ్వర బాబు, కోదండ రామాలయ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐగా రామసుబ్బయ్య బాధ్యతల స్వీకరణ



పెద్దవడుగూరు- సూర్యవాస్తవం: పెద్దవడుగూరు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రామ సుబ్బయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుంతకల్లు వన్‌టౌన్ నుంచి బదిలీపై పెద్దవడుగూరుకు వచ్చారు.

## 3వ వార్డులో చౌక దుకాణం ప్రారంభించిన టీడీపీ నాయకులు



పామిడి - సూర్యవాస్తవం : బుధవారం గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు పామిడి పట్టణం 3వ వార్డులో నూతన డీలర్ వెంకటేష్ ప్రభుత్వ చౌక దుకాణాన్ని పామిడి పట్టణ టీడీపీ నాయకులు ప్రారంభించి డీలర్ వెంకటేష్‌కి ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముసలిరెడ్డి .బొల్లు శ్రీనివాస రెడ్డి, ముసలి రెడ్డి, జింకల సంజీవ, బొమ్మ మోహన్ కృష్ణ, సూరి. మాధవ. నల్లబోతుల శ్రీనివాసులు, అశోక్, ప్రతాప్. టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు..

# విద్య దోపిడీ.... ఇంకెన్నాళ్లు....!?

**- చైతన్య స్కూల్ ఏటీపీ బ్రాంచ్ వన్‌పై చర్యలు తీసుకోవాలి**
**- పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్**



అనంతపురం - సూర్యవాస్తవం: అనంతపురం డీఈవోకి పిడిఎస్‌యు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక టవర్ క్లాక్ వద్ద ఉన్న చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం నాడు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు రామన్న , లాయర్ రంగనాయకులు పాల్గొని మాట్లాడుతూ .... సంవత్సరం క్రితం ఐదవ తరగతి టవర్ క్లాక్ వద్ద ఉన్నటువంటి చైతన్య స్కూల్లో కేవలం 13000 రూపాయలు మాత్రమే చెల్లించడం జరిగిందనీ కానీ ఈ సంవత్సరం ఆరవ తరగతి గాక 20 శాతం మాత్రమే పెంచి ఫీజులు తీసుకోవాలని ఫీజుల నియంత్రణ చట్టం ఉన్న ఈ చట్టాన్ని పక్కనపెట్టి 37 వేల రూపాయలు అంటే 200% అధిక ఫీజు అడగడం చాలా దుర్మార్గమని వారు మండిపడ్డారు. దానితో పాటుగా పుస్తకాల పేరుతో పదివేల రూపాయలు వసూలు చేశారు. ఈ సమయంలో టి సి తీసుకొని వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఇలా ముందు అడ్మిషన్ చేయించుకునేటప్పుడు ఆ తరువాత ఒక రకమైన ఫీజు అడ్మిషన్ చేయించుకున్న నెలలు గడిచిన తర్వాత ఇంకో రకమైన ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్న పరిస్థితి వీటిపై అనేకసార్లు డీఈఓ దృష్టికి డివైఇఓ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది కాబట్టి వీటిపై పూర్తిస్థాయిలో ఎంక్వయిరీ చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి చైతన్య విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడదామని వారు హెచ్చరించారు.

## సేద్యం సినిమా సీమ రైతుల స్థితిగతులను ప్రతిబింబించింది

**- అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మి నారాయణ**

అనంతపురం - సూర్యవాస్తవం:
రాయలసీమ కథగా సేద్యం సినిమా రైతుల స్థితిగతులను తెరకెక్కించిన తీరు చాలా అద్భుతమని అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మి నారాయణ కొనియాడారు. ఇటీవల కాలంలో రైతుల సామాజిక అంశంగా సేద్యం చిత్రం ఈనెల 6న జీఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్స్ నందు విడుదల కాబోతుండగా, బుధవారం అనంతపురం నగరంలో పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మి నారాయణ తన క్యాంపు కార్యాలయంలో సేద్యం చిత్రం పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... రాయలసీమ కథ ఇతివృత్తంగా సేద్యం నిలుస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, దీనికి మద్దతు తెలుపుతూ రైతులకోసం చేసిన ఈ సేద్యం చిత్ర బృందాన్ని అభినందించారు.

భవిష్యత్తులో ఇలాంటి సామాజిక అంశాలపై మన అనంతపురం యాస భాషతో మరిన్ని చిత్రాలు రావాలని, దానికి మా వంతు ప్రోత్సాహం ఎపుడు లభిస్తుందని తెలిపారు.




- ఈ కార్యక్రమంలో ఎంపీ తనయులు వీక్షిత్, సేద్యం దర్శకులు చంద్రకాంత్ పసుపులేటి, సహ దర్శకులు చేగువేరా హరి, నటులు పసుపులేటి శ్రీనివాసులు, కరుణకర్, సుజాత, బాబా ఫకృద్ధిన్, జశ్వంత్ వ్యాస్ పాల్గొన్నారు.

## నూతన మినరల్ వాటర్ సదుపాయం కల్పించిన గుత్తి ఇన్‌ఛార్జి





గుత్తి - సూర్యవాస్తవం : గుంతకల్లు నియోజకవర్గం, శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఆయన సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ గుత్తి ఇన్‌చార్జ్ అయిన గుమ్మనూరు నారాయణ గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామంలో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పెద్దొడ్డి గ్రామంలో ఉన్న పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో మమేకమై అక్కడున్న సమస్యలు తెలుసుకుని, అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు భోజనం వండేందుకు సిలిండర్ సౌకర్యం లేదన్న విషయం తెలుసుకుని గుమ్మునూరు నారాయణ పాఠశాలలో భోజనం వండే వారికి సిలిండర్లకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

**- జిల్లా ఎస్పీ వి.రత్న**

హిందూపురంటౌన్ - సూర్యవాస్తవం: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శ్రీసత్య సాయి జిల్లా ఎస్పి వి.రత్న పేర్కొన్నారు. బుధవారం హిందూపురం పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాల్‌లో అన్ని మతాల పీస్ కమిటీ సభ్యులు వినాయకచవితి ఏర్పాట్ల నిర్వాహ కులు, పుర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఎస్పీ వేడుకలపై డీఎస్పీ కెవి. మహేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, తదితరులు పాల్గొన్నారు.





## పట్టణ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలుగా లక్ష్మీ గంగాధర్ ఎంపిక

హిందూపురంటౌన్ -సూర్య వాస్తవం: శ్రీ సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎం శేఖర్ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణం బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలుగా లక్ష్మీ గంగాధర్ ను ఎంపిక చేసినట్లుపట్టణ బిజెపి అధ్యక్షుడు కరణం నగేష్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు,ఈ సందర్భంగా బిజెపి సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేసే నాయకురాలు లక్ష్మీ గంగాధర్ ను పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ చేతుల మీదుగా పట్టణ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలుగా లక్ష్మి గంగాధర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ గంగాధర్ మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని లక్ష్మీ గంగాధర్ తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, జిల్లా పెద్దల సూచన మేరకు ఓ ప్రక్క పార్టీ బలోపేతానికి మరో ప్రక్క ప్రజా సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు,పట్టణ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురా లుగా ఎంపిక చేయడానికి కృషిచేసిన జిల్లా అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, ఇతర బిజెపి నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ఎస్పీకి శ్రీవారి పాదాలు చిత్రపటం అందజేసిన రాయల్ గోపాల్



హిందూపురంటౌన్ -సూర్య వాస్తవం: హిందూపురం పట్టణంలో బుధవారం నిర్వహించిన వినాయక ఉత్సవాల శాంతి కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా ఎస్పీ రత్న ( ఐపీఎస్) తిరుమల తిరుపతి శ్రీవారి పాదాల చిత్రపటం అందించిన పేట వెంకటరమణ స్వామి దేవాలయ మాజీ చైర్మన్ రాయల్ గోపాల్,ఈ సందర్భంగా రాయల్ గోపాల్ మొట్టమొదటిసారి జిల్లాఎస్పీ కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శ్రీవారి పాదాల మెమెంటోఅందజేశారు ,వినాయక చవితి ఉత్సవాలు జయప్రదం చేయడానికితమ వంతు కృషి చేస్తామని ఎస్పీతో రాయల్ గోపాల్ పేర్కొన్నారు.

# నాణ్యమైన పురుగుల మందులు విక్రయించాలి

**- అనుమతులేని మందులు విక్రయిస్తే కఠిన చర్యలు**
**- వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి**



దువ్వూరు- సూర్యవాస్తవం : మండల కేంద్రమైన రైతులకు పురుగుమందుల యజమానులు నాణ్యమైన మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన దువ్వూరులో మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పురుగు మందుల దుకాణదారుడు సరైన పత్రాలుఉంచుకొని రైతులకు విక్రయించాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేని పురుగుమందులను విక్రయించినట్లు అయితే వాటిని సిజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులకు అందుబాటులో నాణ్యమైన ముందులను ఉంచాలని సూచించారు .అలాగే పలు దుకాణాలలో పురుగుమందులను శాంపిల్ సేకరించి ల్యాబ్ కు పంపడం జరిగిందని ఏవో తెలిపారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు వేసి మందులు విక్రయించాలని తెలిపారు.

# ఉర్దూ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ కిట్స్ అందజేత



రైల్వేకోడూరు - సూర్యవాస్తవం: స్థానిక రైల్వే కోడూరు మండలంలోని ఎంజీ రోడ్డులోని ఉర్దూ స్కూల్‌లో డబ్ల్యూహెచ్ఆర్సి ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్, సయ్యద్ మెహతాజ్ బేగం ఆధ్వర్యం లో విద్యార్థులకు స్టేషనరీ కిట్స్‌ని అందజేశారు. మెహతాజ్ బేగం మాట్లా డుతూ ఉర్దూ భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ అలాగే గడిచిన ప్రభుత్వంలో ఉర్దూ భాషను ఆంధ్ర రాష్ట్రంలో రెండవ అధికారిక భాషగా ప్రకటించిన దానిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, కూటమి ప్రభు త్వంలో చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉర్దూ భాషకు ఔన్నత్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపడతామని ఆమె అన్నారు. అలాగే ఉర్దూ స్కూల్లో చదివిన చాలామంది గొప్ప స్థానాలకు దేశానికి సేవ చేసే విధంగా ఉన్నత పదవులు పొందాలని అదే బాటలో విద్యార్థులు కూడా నడవాలని ఆమెహిత బోధ చేశారు. అలాగే విద్యార్థులకు క్రమశిక్షణ, బాధ్యత ఉండాలని ఆమె గుర్తు చేశారు. ఈ వయసులో చదువు మీద తప్ప వేరే ధ్యాస ఉండకూడదని అలాగే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా తమ నైపుణ్యాలను కనబరుచుకోవాలని ఆమె అన్నారు.నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు భారతదేశ నిర్మాణానికి కాబోయే నిర్వాహకులు అని ఆమె తెలియజేశారు. దేశంలో ఉర్దూ స్కూల్ ల సంఖ్య రాను రాను తగ్గిపోతుందని ఉర్దూ భాషను గౌరవించాలని ఆ విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఉర్దూ స్కూల్ అభివృద్ధిని ధ్యాసలో ఉంచుకొని ఫండ్స్ కానివ్వండి అదేవిధంగా విధానాలు కానివ్వండి రూ పొందించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ మానవ అధికార సంస్థ సభ్యులు షేక్ అజీమ్, కటికం సునీత, రమణ పాల్గొన్నారు.

# దండపాణి ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు-సూర్యవాస్తవం:
స్థానిక కొర్రపాడురోడ్డులోని ఎస్ఎస్ మాల్ నందు దండపాణి వ్యాపారాల అధినేత దండపాణి శ్రీనివాస్ కుమార్ ఏర్పాటు చేసిన నూతన ఎక్స్లుసివ్ షోరూమ్‌ను బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం దండపాణి శ్రీనివాస్ కుమార్, వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయుకులు వియస్ ముక్తియార్, ఇవి సుధాకర్ రెడ్డి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, కౌన్సిలర్ కమాల్‌బాషా, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**- సిద్దవటం, అట్లూరు పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



సిద్దవటం - సూర్యవాస్తవం : పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. జిల్లాలోని సిద్దవటం, అట్లూరు పోలీస్ స్టేషన్‌లను బుధవారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎస్సైలు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల నుండి పిటిషన్ తీసుకుని నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్దిష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.

కొత్తగా స్టేషన్లలో బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు ఫిర్యాదు దారుల పిటిషన్లను రిజిస్టర్‌లో పరిశీలించి ఎలా పరిష్కరించాలో చూడాలని ఆదేశించారు. పిటిషనర్‌కు అనుకూలంగా జరిగిందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. పరిష్కారం అయ్యా యో లేదో అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. పాత నేరస్థులు, సస్పెక్ట్‌లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. నేరాల్లో పాల్గొంటున్నారా లేదా అనే సమాచారాన్ని వారితో మాట్లాడి తెలుసుకోవాలని ఆదేశించారు. వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్.హెచ్.ఓలు జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన చెక్ లిస్టు మేరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సి.డి ఫైల్ లో ఉంచి దర్యాప్తు ప్రక్రియ సజావుగా జరిగేలా, దర్యాప్తు నైపుణ్యం పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేర సమీక్షా సమావేశంలో, ప్రతి రోజు తాము ఇచ్చే ఆదేశాలను క్రింది స్థాయి సిబ్బందికి తెలియచేయాలని ఆదేశించారు. ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూడాలని ఎస్సైలను ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు పిటిక్ వర్క్ లో భాగంగా స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి రోజులో సగ భాగం ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి కార్యకలాపాలపై పోలీసులు నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.వెంకట రాముడు, ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్సై వెంకట నాగ చిరంజీవి, అట్లూరు ఇంచార్జ్ ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

# మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు పాదయాత్ర

**- కుటుంబ సభ్యులతో మొక్కుబడి తీర్చుకునేందుకు తిరుమలకు పాదయాత్రగా వెళ్లిన టిడిపి జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులు రెడ్డి**




చెన్నూరు-సూర్యవాస్తవం: తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందాలని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, అలాగే కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని ఏడుకొండలవాడికి మొక్కుకోవడం జరిగిందని తన కోరిక నెరవేరినందుకు తన కుటుంబ సభ్యులతో సహా తిరుమల ఏడుకొండల స్వామికి మొక్కుబడి తీర్చేందుకు తన కుటుంబ సభ్యులతో సహా తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో మండలంలోని గుర్రంపాడు పంచాయతీ లోని ఓబులంపల్లె నుండి దేవుని తొలి గడప పాత కడప లోని వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం అక్కడి నుండి తిరుమలకు బయలుదేరి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గుర్రంపాడు పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో హేమా హేమీ లైనటువంటి ఎందరో నాయకులు ఉన్నప్పటికీ ఇక్కడ తెలుగుదేశం పార్టీ మంచి మెజారిటీ సాధించడంతోపాటు ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం జరిగిందన్నారు. తన పంచాయతీలో అత్యధిక మెజారిటీ సాధించడమే కాకుండా రాష్ట్రంలో తెలుగుదేశం ఎన్ డి ఏ కూటమి అత్యధిక స్థానాలు సాధించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో తన కోరిక నెరవేరిందని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుండి తన పంచాయతీలో వైసిపి హేమా హేమీలదే పై చేయిగా ఉండేదని అలాంటిది ఒక్కసారిగా తెలుగుదేశం పార్టీకి మంచి ఊపు రావడం, దీంతో పార్టీ లో పనిచేసే ప్రతి కార్యకర్త తన శక్తికి మించి పనిచేయడం ద్వారా పంచాయతీలో మంచి పట్టు సాధించగలిగామని దాంతో ఆర్థిక మంచి మెజారిటీ రావడం జరిగిందన్నారు. ఇదే ఉత్సాహంతో, ఇదే ప్రోత్సాహంతో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇదంతా కూడా ఇలా జరగడానికి ఆ ఏడుకొండలవాడు ప్రసాదించిన వరమేనని అందుకే ఆయనకు తాము మొక్కుకున్న మొక్కుబడి తీర్చుకునేందుకు తమ కుటుంబ సభ్యులతో సహా తమ పంచాయతీ నుండి తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని తమ ఆకాంక్ష అని ఆయన తెలిపారు. టిడిపి నాయకులు ముండ్ల శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో తిరుమలకు పాదయాత్ర చేస్తున్నారని తెలియడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు కలిసి వచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

# గర్భిణులు, పిల్లలు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి

**-ఐసిడిఎస్ సూపర్వైజర్లు సౌజన్య, వరలక్ష్మి**




దువ్వూరు- సూర్యవాస్తవం : గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు సమతుల ఆహారం తీసుకోవాలని అలాంటప్పుడే ఆరోగ్యం బాగుంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్లు సౌజన్య, వరలక్ష్మీలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఐసిడిఎస్ గుడిపాడు సెక్టార్ పరిధిలోని చింతకుంట 2 అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య, దువ్వూరు సెక్టార్ దువ్వూరు 1 అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్,వరలక్ష్మీ లు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తినే ఆహారం పైనే వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. వారు తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఫైబర్, సూక్ష్మ పోషకాలు అన్నీ ఉండేలా చూసు కోవాలి. ప్రతి సంవత్సరము సెప్టెంబర్ 1 తేదీ నుండి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు జరుపుకుంటాము. మాంస కృతులు సరైన మోతాదులో లేకపోయినా, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా తీసుకున్న అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల సమతుల్యమైన ఆహారం మంచిదన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని,వారి పెరుగుదలకు ఎంతో దోహదపడతా యన్నారు. స్థానికంగా దొరికే పోషకాహారం తీసుకోవాలని సౌజన్య తెలిపారు. ఐరన్ తో కూడిన ఆహార పదార్థాలను తినాలని సూచించారు. పండ్లు తగిన మోతాదులో తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, సాహిదా బేగం, కె.ప్రసన్న కుమారి, ఆయాలు,ఆశ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఘనంగా గురుపూజోత్సవం

మైదుకూరు - సూర్యవాస్తవం: గురుని పూజలేక గురుతెట్లు కల్గునో అజునికైన వాని యబ్బ కైన..అంటూ వేమన గురుని బోధ వినక కోటి జన్మములెత్తిఎంత చదువు తత్వమెరుక పడదు.. అంటూ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు గురువు యొక్క గొప్పతనాన్ని చెప్పారు.సెప్టెంబర్ 5 గురుపూజోత్సవ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తను దాదాపు 40 సంవత్సరాల కిందట కడప జిల్లా ఖాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు గణితం బోధించిన బత్తెన మల్లారెడ్డి, ఆయన భార్య పుల్లమ్మ దంపతులను కలిసి పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నేను విశ్వవిద్యాలయం ఆచార్య స్థాయికి వెళ్ళగలిగానంటే అది నాకు చిన్నప్పటినుండి గురువులు బోధించిన క్రమశిక్షణ కలిగిన విద్యేనని అన్నారు. అప్పట్లో మా గురువు మల్లారెడ్డి విద్యార్థుల నందరిని సమాన స్థాయిలో చూసేవారని, ఏ ఒక్క రోజు ఆయన ఆదివారం తప్ప తరగతి గదిలో లేకుండా ఉండే రోజు లేదని, ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత ప్రైవేటు పాఠశాలను నెలకొల్పి ఎన్నో వేల మంది విద్యార్థులకు, వందల మంది అధ్యాపకులకు మార్గ నిర్దేశకత్వం చేశారని అన్నారు. తెలుగు పద్యం అంటే ఆయనకు చాలా ఇష్టమని, ఈరోజు కూడా ఎన్నో పద్యాలు ఆయనతో పాడించుకొని వినడం చాలా సంతోషం కలిగిందని, 92 సంవత్సరాల వయసులో కూడా పాతిక సంవత్సరాల యువకుని వలె ఆయన పద్యాన్ని పాడడం నిజంగా గొప్ప విషయమని అన్నారు. గురుపూజోత్సవానికి ఒకరోజు ముందుగా ఆయనతో ఒకరోజు గడపడం నా జీవితంలో మధురమైన అనుభూతిని ఇచ్చిందని, ఈ కార్యక్రమంలో నా ఆత్మీయ శిష్యుడు ఆంధ్రప్రదేశ్ పూర్వ అధికార భాష సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పాల్గొనడం విశేషం అన్నారు.

# తిరుపతి నగరానికి తలమానికంగా రైల్వే స్టేషన్

**- తిరుపతి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ గురుమూర్తి**




తిరుపతి –సూర్యవాస్తవం: తిరుపతి ఎంపీ డాక్టర్. మద్దిల గురుమూర్తి నేడు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే స్టేషన్ డైరెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు స్టేషన్ నిర్మాణ పనుల గూర్చి ఎంపీకి వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్టేషన్ నిర్మాణాల పురోగతి, రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల గురించి రైల్వే ఇంజనీరింగ్ విభాగం వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

తిరుపతి రైల్వే స్టేషన్ ద్వారా సంవత్సరానికి సుమారు 6కోట్ల మంది ప్రయాణిస్తున్నారని వారందరికీ అనుకూలంగా ఉండే విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఆయన అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు సాధించామని గత ప్రభుత్వ హయాంలోనే పనులు మొదలయ్యాయని అన్నారు. ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం తిరుపతి నగరానికి తలమానికం అని అన్నారు. సిఆర్ఎస్ లెవెల్ క్రాసింగ్ 109 వద్ద నిర్మించ తలపెట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయని, లెవెల్ క్రాసింగ్ 108 కాటన్ మిల్లు దగ్గర, లెవెల్ క్రాసింగ్ 107 హీరోహొండా షోరూం దగ్గర అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం కేబుల్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయని త్వరలో పూర్తి స్థాయిలో పనులు మొదలవుతాయని ఎంపీ తెలియజేసారు. వర్షాకాలం మొదలయిందని తిరుపతి పార్లమెంటు పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జిలలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను కోరారు. ఎంపీ నిధులు, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిధులతో తిరుపతి బస్టాండ్ ఎదురుగ నిర్మించ తలపెట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని ఎంపీ రైల్వే అధికారులను కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఒక ప్రక్కన పనులు మొదలయ్యాయని, త్వరలో మరో వైపు పనులు మొదలెడుతామని వారు తెలియజేసారు.

రేణిగుంట సంత గేటు వద్ద కూడా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించనున్నారని తెలియజేసారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి నెం. 171 నుంచి 175 వరకు 1200 మీటర్ల పొడవున సరైన నీటి పారుదల సౌకర్యం లేదని వారికీ తెలియజేసారు. రైలు మార్గం పక్కనే ఉన్న కాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోతోందని వర్షాకాలంలో డ్రైనేజీ సరిగా లేకపోవడంతో ట్రాక్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని అక్కడ సరైన డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయాలనీ ఎంపీ కోరారు.

మొత్తం రూ.200 కోట్లతో రేణిగుంట రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పనులు నాలుగు దశలలో చేపడతారని మొదటి దశ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. అవసరమైన అనుమతులు త్వరగా సాధించి పనులు మొదలెట్టాలని అనుమతుల విషయంలో ఏవైనా అవరోధాలు ఉన్నట్లయితే తన సహకారం తీసుకోవాలని అధికారులను కోరారు. దానితోపాటు గూడూరు తిరుపతి మూడవ రైల్వే లైన్ కూడా శాంక్షన్ అయ్యిందని ఈ సందర్భంగా ఎంపీ తెలియజేసారు. పూడి, ఏర్పేడు రైల్వే లైన్ నిర్మాణం కోసం త్వరితగతిన భూసేకరణ చేయడం కోసం జిల్లా కలెక్టరుతో మాట్లాడుతానని తెలియజేసారు.



# సూక్ష్మకుటీర దుకాణాల నిర్వహణపై శిక్షణ

శాంతిపురం–సూర్యవాస్తవం,సెప్టెంబర్4: ప్రముఖవాణిజ్య సంస్థ ఈజీ మార్ట్ వారి సూక్ష్మ కుటీర దుకాణాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాంతిపురం మండల పరిధిలోని రాళ్లబూదుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీ మార్ట్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వినూత్న , నూతన ప్రణాళికా వ్యాపారంతో ప్రతి గ్రామంలో యువతకు రెండు నుండి మూడు ఉద్యోగాలు సృష్టించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈజీ మార్ట్ ద్వారా మన రాష్ట్రంలో 10,000 నుండి 15,000 మందికి జీవనోపాధి లేదా ఉద్యోగాలు సృష్టించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. 5 జూలై 2024 నుండి ఇప్పటివరకు 100 కిరాణా షాపులు ఈజీమార్ట్ మహిళలతో ప్రారంభింప చేసినట్లు తెలిపారు అవి ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకు దూసుకెళున్నాయని అన్నారు దీనివల్ల ఇప్పటికే 200 మందికి జీవనోపాధి దొరకిందని ఈజీ మార్ట్ వారి వినూత్న ప్రణాళికతో గ్రామీణ ఉపాధి,ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రం ఎంతో మారి పోతుందన్నారు. ఎటువంటి ఉచిత రాయితీలు లేకుండా ప్రతిమహిళ తన సొంత కాళ్ళ మీద నిలబడి ప్రతినెలా క్రమం తప్పకుండా డబ్బులు సంపాదించుకునే గొప్ప అవకాశం ఉందన్నారు.దీనికి పెద్ద చదువు అవసరం లేదని కేవలం తన గ్రామంలోనే వ్యాపారం చేసుకోవచ్చని వాట్సాప్,అమెజాన్, లాంటి అప్లికేషన్స్ వాడటం వచ్చిన వారు పదవ తరగతి వరకు చదువుకొని కొంచెం ఇంగ్లీషు వస్తే నెలకి 20000 కు పైగా



సంపాదించుకునే మహత్తర అవకాశమని ఈ కిరాణా దుకాణం యజమాని ప్రతిరోజు తన గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి నుండి సరుకులు ఆర్డర్ తీసుకొని దుకాణం నుండి త్వరగా నాణ్యమైన ,బ్రాండెడ్ సరుకులు డెలివరీ చేయ వచ్చని అన్నారు,మన కేంద్ర బడ్జెట్లో గ్రామీణ అభివృద్ధికి 2.66 లక్షల కోట్ల రూపాయలు, మహిళల అభివృద్ధికి 3 లక్షల కోట్ల రూపాయలు, వ్యవసాయం, వ్యవసాయేతర రంగాల అభివృద్ధికి 1.5 లక్షల కోట్లు రూపాయలు, విద్య మరియు వృత్తి నైపుణ్యాలకు 1.48 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారని ఆ సంస్థ ప్రతినిధులు చెప్పుకొచ్చారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ క్షంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత 30 సంవత్సరాలుగా కుప్పంను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు ఈ ఐదు సంవత్సరాలు మరింత అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారని,ప్రతి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా కుప్పం నుండే మొదలు పెడతారని, ప్రతి మహిళ లక్ష్యాధికారికావాలనే తపన పడుతుంటారని అన్నారు ఈ నేపథ్యంలో ఈ సూక్ష్మకూటీర షాపులు వినియోగించుకోవాలని కోరారు,ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మాత్,కుప్పం ఇంచార్జ్ పి.ఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు,భాష్యం విశ్వనాథ నాయుడు, నాగరాజు,ఆర్.ఎస్ మణి,సచివాలయ సిబ్బంది వెలుగు సిసి సిబ్బంది, డ్వాక్రా మహిళలు ప్రజలు,స్థానిక నేతలు జయరాజ్,కుమార్, మురళి,రామన్న,మురళి,చలపతి,పాల్గొన్నారు.



# ప్రత్నామాయ పంటగా ఉలవల విత్తనాల పంపిణీ

శాంతి పురం –సూర్య వాస్తవం : బీడు భూములకు ప్రత్యామాయ పంటగా 80 శాతం రాయితీ ఉలవల విత్తనాలు పంపిణీ శాంతిపురం మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు పంపిణీ చేశారు, ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం ఇంచార్జ్ పి.ఎస్ మునిరత్నం, శాంతిపురం మండల అధ్యక్షులు భాష్యం విశ్వనాథ నాయుడుచే ఉలవల విత్తనాల పంపిణీ ప్రారంభించారు. అనంతరం రైతులకు రైతు సేవ కేంద్రాలలో రిజిస్టర్ చేసుకున్న రైతులకు ఉలవల విత్తనాలు పంపిణీ చేశారు, మండలంలోని 20 రైతు సేవ కేంద్ర కేంద్రాల పరిధిలో పంటలు వేయని రైతుల కోసం ప్రత్నామాయ పంటగా ఉలవల విత్తనాలు 80% రాయితీతో పంపిణీ చేయునట్లు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 20 రైతు సేవ కేంద్రాల పరిధిలో 340 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు 80% రాయితీతో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జి.అపోజి తెలిపారు, వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా ఈ ఖరీఫ్ సీజన్లో పంటలు వేయని రైతుల కోసం ప్రత్నామాయ పంటగా ఉలవ విత్తనాలు పంపని చేయనున్నట్లు, విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు



విత్తనాలు కచ్చితంగా సాగు చేయాలని,పంట నమోదు చేసుకోవాలని తెలిపారు ఉలవలు పంట వేయడం వల్ల అన్ని భూములు సాగులోకి తీసుకొస్తూ తద్వారా భూమి ఆరోగ్యంగా ఉంటుందని దిగుబడి ఆదాయం కూడా ఉంటుందని పశువులకు మేతగా ఉపయోగపడుతుందని,ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, 10 కిలోల ఉలవ విత్తనాల బ్యాగు 80% రాయితీతో,20% రైతు వాటా 174 రూపాయలు చెల్లించి రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ పట్టాదారు పాసుపుస్తకం మొబైల్ నెంబర్ చూపించి రైతు సేవ కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా ఆన్లైన్లో పేరు నమోదు చేసుకుని విత్తనాల పొందవచ్చని తెలిపారు,ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, స్థానిక నేతలు ఆర్.ఎస్.మని, జయరాజ్ బి.యం.కుమార్ బసవరాజ్ వాజిద్ రామన్న, మురళి పాల్గొన్నారు.



# ఇంటింటికి సర్వే పకడ్బందీగా చేయండి

**- బి ఎల్వోలకు సూచించిన తహసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్**

బంగారుపాల్యం–సూర్య వాస్తవం : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం బిఎల్వోలతో మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఇంటింటికి సర్వే పగడ్బందీగా చేయాలని, 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు.బూత్ స్థాయి అధికారులు , బిఎల్ఏ సహకారంతో తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి పరిశీలించి కొత్త ఓటు నమోదు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 17 ఏళ్ల నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశం నందు సూపర్వైజర్లు ఇబ్రహీం, లావణ్య, ఎలక్షన్ ఆపరేటర్ దుర్గ తదితరలు పాల్గొన్నారు.

# వినాయక మండపానికి అనుమతి తప్పనిసరి

**- మండల అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాసులు**





బంగారుపాల్యం–సూర్య వాస్తవం, :చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నందు తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వినాయక మండపానికి తప్పనిసరి అనుమతి తీసుకోవాలని త్రిసభ్య కమిటీ సభ్యులు తహసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, సిఐ శ్రీనివాసులు, ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో వినాయక మండపం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు అనుమతి కోరేటప్పుడు ఎప్పుడు నిమజ్జనం కార్యక్రమం చేస్తారో వాటి పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో తెలపాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో రి సర్వే డిటి ఇబ్రహీం , మండల సర్వేయర్ లావణ్య, స్థానిక విఆర్ఓ లతో పాటు పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# అక్రమ కేసుల్లో పట్టుబడ్డ 11 లక్షల విలువ గల మద్యం ధ్వంసం



తవణంపల్లి –సూర్య వాస్తవం : చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం పోలీస్ స్టేషన్ కి సంబంధించిన నీటి కుంట పక్కన ఖాళీ స్థలంలో అక్రమంగా పట్టుబడ్డ 11 లక్షల విలువైన మద్యాన్ని బుధవారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వి. శ్రీధర్ బాబు చిత్తూరు వారి ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వుల మేరకు, తవణం పల్లె పోలీస్ స్టేషన్ లోని నమోదు కాబడిన కేసులలో 11,447 మద్యం బాటిల్లను,1965 లీటర్ల లిక్కర్ బాటిల్స్ 32 కేస్లను తవణంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏ. చిరంజీవి మధ్యవర్తుల సమక్షంలో జెసిబి సహాయంతో నశింప చేశారు.

# హైవేలో ఉన్న దాబా హోటల్‌లకు లోకల్ షాపులకు సీసీ కెమెరాలు తప్పనిసరి



బంగారుపాళ్యం– సూర్య వాస్తవం: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన ఓ సమావేశంలో సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, హైవేలో గల డాబా హోటల్లు లోకల్ షాపులు ఓనర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి సిసి కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈమధ్య కొన్నిచోట్ల దొంగతనాలు ఎక్కువగా జరుగు తుండటంతో డాబా హోటల్లు, లోకల్ షాపులు, సంత వీధి, ఏటీఎంల దగ్గర సీసీ కెమెరాల అవసరం గురించి వివరించి సమాజంలో నేరాల సంఖ్య పెరుగుతున్నదని వీటిని అరికట్టాలంటే సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కొంతమంది యాజమాన్యాలకు సీఐ శ్రీనివాసరావు కౌన్సిలింగ్ చేయడం జరిగింది.

## విద్యార్థి ఉన్నత స్థానాలలో వెళ్లాలి



**కడప-సూర్య వాస్తవం ప్రతినిధి:** ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడు దగ్గర. క్రమశిక్షణతో చదివి ఉన్నంత స్థానాలకు వెళ్లాలని జెకె జనం కోసం సేవా సంస్కృతిక విద్య క్రీడా అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెకె ఖాదర్ భాష అన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయుల దినోత్సవం శుభ సందర్భంగా రెండో రోజైన నేడు అల్లం ఖాన్ పల్లి లో ఉన్న జడ్పీహెచ్ఎస్ నందు హిందీ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న కె ఎస్ ఫర్హాతుల్లా ను ఘనంగా సత్కరించి జాపిక ను అందజేయడం జరిగినది. జీకే. ఖాదర్బాషా మాట్లాడుతూ 8 9 10 తరగతులలో మొదటి ర్యాంక్ సంపాదించుకున్న విద్యార్థులకు తమ వంతుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు చాంద భాష పి ఈ టీ నిత్యానంద జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మునిరత్నమ్మ. ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు విద్యార్థినులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రి సిబ్బంది కొరత పరిష్కారానికి కృషి చేస్తాం



**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** జిల్లా ఆసుపత్రి సిబ్బంది కొరత పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీజే నాయకులు తెలిపారు. ఎంపీజే రాష్ట్రవ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య సమస్యలపై సెప్టెంబర్ 1 నుంచి 15 తేది వరకు ఉద్యమాన్ని నిర్వహిస్తున్న తరుణంలో బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ని సందర్శించారు. ప్రజలకు మెరుగు అయినా వైద్యం అందుతుందా లేదా అని ఆసుపత్రి సూపర్డెనంట్ ఆనంద్ ని కలిసి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్యం ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవ లు అందిస్తున్నామని, మిషనరీలు, మెరుగైన సదుపాయాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం సిబ్బంది కొరుత ఉందన్నారు. అనంతరం చిన్న పిల్లల వార్డ్ ను సందర్చించి వారి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోవడం జరుగుతుందని సూపరడెంట్ కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ భాష, కార్యదర్శి మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు నజీర్,ఇస్మాయిల్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులతో పర్యావరణాన్ని రక్షిద్దాం!



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** వినాయక చవితిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మట్టి వినాయకులను ప్రోత్సహించడంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ వినాయకచవితికి పూజించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, చెరువులు,నదులు కలుషితమవుతున్నాయని దానిని నివారించడానికి మట్టి విగ్రహాలు కొని లేదా స్వంతంగా చేసి పూజించవచ్చని తెలియజేశారు. ఈ సంస్కృతిని ప్రోత్సహించడానికి విద్యార్థులలో చైతన్యం తీసుకురావడానికి మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎకో ఫ్రెండ్లీ క్లబ్ కన్వీనర్ జి.కుసుమ ప్రియ తెలియజేశారు. అంతేకాకుండా మన విద్యాసంస్థలు మత సామరస్యానికి ప్రతీకలని నిరూపిస్తూ హిందూయేతరులు కూడా విగ్రహాలు తయారు చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్య శేఖర్ రెడ్డి,సుబ్బారాయుడు, గురుమూర్తి,విష్ణు ప్రియ,నమ్రత, జ్యోతి,మోహన వల్లి,హాజీరా ఖానం తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులను ఆదుకుందాం..!

❖ తనవంతుగా రూ.2 లక్షల ఆర్థిక సాయం


❖ మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపు



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** భారీ వర్షాలతో విజయవాడలో వరద ముంపుకు గురై సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకుందాం.. అందుకు తనవంతు సాయంగా రూ.2 లక్షలు అందజేస్తున్నానని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. బుధవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా కురిసిన అతి భారీ వర్షాలు ఏపీపై పెనుప్రభావం చూపాయన్నారు. కోస్తాలోని పలు జిల్లాల్లో అనేక గ్రామాలు నీట మునిగి, వేలాదిమంది ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయా రన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు చేపట్టి బాధితులకు భరోసానిస్తున్నా రన్నారు. వారి స్ఫూర్తితో మదనపల్లె నియోజక వర్గం నుండి విరాళాలను సేకరించి బాధితులకు అండగా నిలుస్తా మన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురదజల్లు తున్నారని, ఇది సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి తగు సలహాలు, సూచనలు ఇచ్చి బాధితులకు అండగా నిలవాలని హితవు పలికారు. వైసిపి పాలనలో ఆయన ఏనాడు తాడేపల్లి ప్యాలెస్ వదిలి రాలేదని, విజయవాడ నగరంలో ఎక్కడా కనీస సౌకర్యాలు కల్పించ లేదని విమర్శించారు. వైకాపా నాయకుల మితిమీరిన ఆక్రమణల వల్లే ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటు న్నాయని ఆరోపించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సబ్ కలెక్టర్ కార్యాలయం ఘటనను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కబ్జాలు ఆక్రమణలు ఎవరు చేశారో అనే దానికి 2024 ఎన్నికల ఫలితాలు నిదర్శనమని ఆయన చెప్పుకొచ్చారు. ఇది విమర్శలు చేసుకునే సమయం కాదని, వరదలతో సర్వం కోల్పోయిన వారికి రాజకీయాలకు అతీతంగా ఆపన్న హస్తం అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు రాటకొండ గుర్రప్ప నాయుడు, నవీన్ చౌదరి, షంషీర్, తమ్మిశెట్టి రామకృష్ణ, కంచర్ల మల్లికార్జున నాయుడు, కత్తి లక్షమన్న, జెసిబి వేణు, జెసిబి మధుసూదన్ రెడ్డి, విజయమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లలందరూ అంగన్వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**




**అన్నమయ్య-సూర్య వాస్తవం:** పిల్లలందరికీ మంచి విద్యాబుద్ధులు నేర్పాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార మీటింగ్ హాల్ నందు ఐసిడిఎస్ పిడి, సిడిపిఓలు మరియు సూపర్వైజర్లతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్వైజర్లు పిల్లల కోసం ప్రత్యేక చొరవ తీసుకొని అంగన్వాడీలను సందర్శించి పిల్లలందరూ అంగన్వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలకు మంచి భోజనాన్ని అందించాలన్నారు. హాజరు శాతం పొరపాట్లు ఉన్నాయని పక్కాగా నమోదు చేసి సరైన హాజరును తెలపాలన్నారు. అంగన్వాడీ కేంద్రము నందు ప్రీ స్కూలు హాజరు శాతం పెంచడానికి తీసుకోవలసిన సూచనలు మరియు సలహాలు సూపర్వైజర్లకు తెలియచేసారు. ప్రతిరోజూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రీ స్కూలు పిల్లలు అటెండెన్స్ ఫోటో, మద్యాహ్నం మిడ్-డే-మీల్ తింటున్నప్పుడు ఒక ఫోటో మరియు సాయంత్రం ఇంటికి పంపే ముందు ఒక ఫోటో ప్రతి అంగన్వాడి కార్యకర్త నోట్ క్యాం యాప్ నందు ఫోటో సూపర్వైజరు కు పంపాలని, ఎంతమంది పిల్లలు ప్రీస్కూలుకు హాజరు అవుతారో వారికి మాత్రమే ఆన్ లైన్ నందు హాజరు నమోదు చేయాలని తెలియచేసారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని సి.డి.పి.ఓ వారికి మరియు సూపర్వైజర్ లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. సి.డి.పి.ఓ మరియు సూపర్వైజర్లు ప్రతిరోజు ప్రీ స్కూలు హాజరును రిజిస్టర్ కు మరియు ఆన్లైన్ కు సరిపోయినదా అని పరిశీలించి తప్పులు చేసిన వారిని సరిదిద్దుకోమని అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని అందరూ సూపర్వైజర్లకు అంగన్వాడీ పని తీరుపై జిల్లాలో ట్రైనింగ్ ఏర్పాటు చేయాలని పి.డిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి శశికళ, సిడిపిఓలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ భవనాన్ని సందర్శించిన కలెక్టర్ లోతేటి శివశంకర్



**కడప-సూర్య వాస్తవం ప్రతినిధి:** కడప ఓల్డ్ రిమ్స్ లో ఉన్నటువంటి బీసీ భవనాన్ని కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వడం,, అలాగే సహాయ సహకారాలు అందించేందుకు హామీ ఇవ్వడం జరిగింది.. మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన కలెక్టర్ లోతేటి శివ శంకర్ కి, బీసీ సంక్షేమ అధికారి ఎం భరత్ కుమార్ రెడ్డి కి,,బీసీ సంక్షేమ సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుట జరిగినది.. పాల్గొన్న ముఖ్య నాయకులు...అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ము లకాని త్రివిక్రమ్ యాదవ్, ట్రెజరర్ ఎం శ్రీనివాసులు, ముఖ్య సలహాదారులు స్.ఖాదర్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ్, రాష్ట్ర మహిళా నాయకురాలు టీ.జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, అంజి, ఆర్ల గంగయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

# సురేష్‌కు శ్రేష్ఠ గురు విశిష్ట పురస్కారం




**మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం:** నేటి సమాజంలో ఆడబిడ్డలపైన జరుగుతున్న అవమాన ఘటనల నుంచి ఆడబిడ్డలు రక్షించుకోవ డానికి ఆత్మరక్షణ విద్య ఒక్కటే శరణ్యం అంటూ ఉచిత ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇస్తూ తనకు ఉన్నతంలో పేదలకు సేవచేయడంలో పలువురి మన్ననలు పొందిన గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఏ.ఆర్.సురేష్ ఎన్నో ఉత్తమ పురస్కారాలకు అర్హుడని పలువురు కొనియాడారు. తిరుపతి వేదికగా రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.జి.రామమూర్తి,ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసా బేగం సంయుక్త ఆధ్వర్యంలో మేక్ మై బేబి జీనియస్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలల్లో ఉత్తమ గురువులకు శ్రేష్ఠ విశిష్ట పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఆర్.సురేష్ చేసిన సేవలకు తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య చేతులమీదుగా శ్రేష్ఠ విశిష్ట గురు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. వేలాదిమందికి ఆత్మరక్షణ విద్యలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం,మహిళ పోలీసులు,వార్డు,గ్రామ సచివాలయ పోలీసులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం,కరోనా సమయంలో చేసిన సేవ కార్యక్రమాలలో డాక్టర్ ఏ.ఆర్.సురేష్ చేసిన సేవలను కొనియాడుతూ తిరుపతి మండల విద్యాధికారి కె.బాలాజీ,చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంగరాజు భాస్కర్ రాజు,దర్శకుడు,మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ కొక్కంటి ఈశ్వరయ్య,వప్రసన్న భారతి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్,జి.వీర శంకర్,డాక్టర్.డి.సి.నారాయణ స్వామి,సి.వి.గణేష్ రెడ్డిలు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )